చిత్రలేఖనం.. సృజనాత్మకం

అత్తాపూర్: హైదర్‌గూడలోని రాధాకృష్ణ నగర్ కాలనీలో అప్పిరెడ్డి బొమ్మారెడ్డి, పద్మారెడ్డి నిర్వహిస్తున్న సంస్కృతి రూరల్ ఆర్ట్ సెంటర్‌కు అంతర్జాతీయ విద్యార్థుల ఆర్ట్ ఎగ్జిబిషన్ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి, ప్రోగ్రెస్ ఆఫ్ ఆర్ట్ బర్డ్స్ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు. కళారత్న ఆర్. రమేష్‌బాబుతో కలిసి సరస్వతిమాత చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఎంపీ ప్రారంభించారు. అంతర్జాతీయ స్థాయిలో చిత్రలేఖన విజేతలకు విద్యార్థి, విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్, బహుమతులను ఆయన ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిత్రలేఖనం సృజనాత్మకమన్నారు. అనంతరం ప్రధాన మంత్రి నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నారగూడం మల్లారెడ్డి, కొమురయ్య, రామేశ్వర్ రావు, సురేందర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, విజయ్ కుమార్, వెంకటేష్, రమేష్, కిరణ్, వేణు, గోపాల్ రెడ్డి, శివకుమార్, రామకృష్ణ, జంగయ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఓరుగంటి భద్రయ్య



ఓరుగంటి భద్రయ్య గుప్తాను అభినందిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ శివరాంపల్లి సంఘంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఓరుగంటి భద్రయ్య గుప్తాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భద్రయ్య మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తూ ఆర్యవైశ్య సభ్యులను అన్ని రకాలుగా ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గుప్తా, రమణగుప్తా తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ల్యాంకోహిల్స్‌లో ర్యాలీలో పాల్గొన్న నివాసితులు

మణికొండ: కోల్‌కత్తాలో డాక్టర్‌పై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన నిందితులను వెంటనే శిక్షించాలని ల్యాంకోహిల్స్ వాసులు డిమాండ్ చేశారు. శనివారం రాత్రి నివాసితులు కొందరు ప్లేకార్డులను పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వాలు, కోర్టులు తక్షణ కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలతో పాటు ప్రజలకు న్యాయం అందించాలన్నారు. ఘటన జరిగి ఇన్ని రోజులైనా ఇప్పటి వరకు ఎవరు విచారణ చేయాలి, ఏ కోర్టులో పెట్టాలనే ఆలోచనలోనే ఉండటం ఏంటి అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇకనైనా ప్రభుత్వాలు, కోర్టులు స్పందించి వెంటనే న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు.

పేకాట ఆడుతున్న 20 మంది అరెస్టు

మణికొండ: ఓ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌లో గుట్టు చప్పుడు కాకుండ పేకాట ఆడుతున్న 20మందిని నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుప్పాలగూడలోని కంట్రీ ఫాం అపార్ట్‌మెంట్స్‌లోని ఫ్లాట్ నెంబర్ 501లో కొంత మంది పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావటంతో పోలీసులు దాడులు చేశారు. ఫ్లాట్‌లో ఏకంగా 20 మంది పేకాట ఆడుతున్నట్టు గుర్తించి వారిని అరెస్టు చేశామన్నారు. అరెస్టు చేసిన వారిలో చేవెళ్ల, మొయినాబాద్ మండలాలకు చెందిన కనకమామిడి మల్లారెడ్డి, విజయ్ భాస్కర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, కె.మల్లారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాంరెడ్డి, జైపాల్‌రెడ్డి, విటల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, అనంతరెడ్డి, బల్వంత్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి ఉన్నారు. వీరి వద్ద నుంచి రూ.1.56.910 నగదు, 20 సెల్‌ఫోన్లు, ఆరు కార్లను సీజ్ చేశారు. ఎస్ఐ ప్రభాకర్ ఫిర్యాదుతో శనివారం రాత్రి కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. వీరికి వాసు అనే వ్యక్తి తన ఫ్లాట్‌ను పేకాట ఆడేందుకు ప్రతి రోజు రూ.5 వేలు అద్దెకు ఇస్తున్నట్టు వారు అంగీకరించినట్టు పోలీసులు వివరించారు.

అత్యాచారం కేసులో వ్యక్తి అరెస్ట్

గచ్చిబౌలి: అత్యాచారం కేసులో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మాదాపూర్ ఏసీపీ సీహెచ్.శ్రీకాంత్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలిలో నివాసం ఉండే ఎస్.ప్రభాకర్‌రెడ్డి(40) డీఎల్ఎఫ్ వద్ద వరలక్ష్మీ టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. కాగా ఇతనికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ యువతి(35) పరిచయమైంది. ఇద్దరు కొంతకాలం కలిసి జీవించారు. ఈ క్రమంలో కొద్ది నెలల క్రితం పెళ్లి చేసుకుంటానని తనను నమ్మించి మోసం చేశాడని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై అత్యాచారం, అట్రాసిటీ కేసు నమోదు చేశారు. శనివారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రేపు సాయిదత్త గణపతి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు

రాయదుర్గం: కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం టెలికామ్‌నగర్‌లో వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయ నిర్వాహకులు రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వేడుకల్లో భాగంగా ఆలయంలో సాయంత్రం 4.30 గంటలకు శ్రీకృష్ణ అష్టోత్తర నామార్చన, 6.15 గంటలకు బాబాకు హారతి, రాత్రి 7 గంటలకు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వైద్యులపై దాడులను అరికట్టాలి

గోల్కొండ: వైద్యులపై దాడులను అరికట్టాలని ప్రముఖ సంఘసేవకుడు మీర్ తాఫిక్ అలీ పేర్కొన్నారు. టోలిచౌకీ వద్ద గల పీస్ ఫోర్స్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు వైద్యులపై దాడులు పెరిగిపోతున్నాయని, అలాగే పాఠశాలల్లోనూ చిన్నారులపై కూడా లైంగికదాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షిస్తేనే మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృత్తం కావాని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎఫ్‌సీవో కార్యాలయ ఇన్‌చార్జి మహ్మద్ ఫహాద్, పీస్ ఫోర్స్ సొసైటీ చైర్మన్ మహ్మద్ నజీబ్, టీఎఫ్‌సీవో మహిళా విభాగం చైర్మన్ సయ్యదా సాదియా, మహ్మద్ ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

ఘనంగా మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవం



స్వామి కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీ మల్లన్న గడ్డపై ఆదివారం శ్రీశ్రీశ్రీ మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ మల్లికార్జున యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవాలకు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, ముదిరాజ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. మల్లన్న స్వామి నామస్మరణతో ప్రశాంత్‌నగర్ కాలనీ మారుమోగింది. మధ్యాహ్నం తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు భారీ ఏర్పాటు నిర్వహించారు. ఈ పూజల్లో పిఎసిఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్, సురేష్‌గౌడ్, మామిళ్ల పెంటయ్యయాదవ్, మామిళ్ల శేఖర్‌బాబుయాదవ్, మామిళ్ల అంతయ్య, పాపయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నీ కాలనీలు, బస్తీల అభివృద్ధికి కృషి : మేయర్



నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మేయర్

బండ్లగూడ: కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ అసోసియేషన్ సమావేశాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై కాలనీలో నెలకొన్న సమస్యలపై సభ్యులతో చర్చించారు. అనంతరం కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి డివిజన్, కాలనీ, బస్తీని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కోట్లాది రూపాయలను వెచ్చించి ప్రజా సమస్యలను పరిష్కరించి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని, కాలనీని త్వరలో అభివృద్ధి పరుస్తామని హామీ ఇచ్చారు.

నూతన కార్యవర్గ సభ్యులు...

మున్సిపల్ కార్పొరేషన్ ప్రశాంత్‌నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులుగా ఆర్.చక్రవర్తి, ఉపాధ్యక్షులుగా హరినాథ్ చౌదరి, మధుసుదన్‌రెడ్డి, బి.తిరుమల్లేష్‌గౌడ్, అనిల్, గొల్లమూడి సంధ్య, కార్యదర్శిగా విజయ ఠాకూర్, సంయుక్త కార్యదర్శులుగా భరత్‌ప్రియాచారి, సత్యనారాయణరెడ్డి, సునీతారెడ్డి, కోశాధికారిగా శ్రీధర్‌రెడ్డి, ఉపకోశాధికారిగా విజయ్‌పద్మనాభం, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కె.వి.ప్రమోద్, టి.ఉమేష్, ఇక్బాల్, వెంకటేశ్వర్లు, మనీష్ దూబే, సాయితేజాగౌడ్ తదితరులు ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు మేయర్ శుభాకాంక్షలు తెలిపారు.

అంతర్జాతీయ బాలల చిత్రకళా ప్రదర్శన ప్రారంభం



బాలల చిత్ర కళాసంచికను ఆవిష్కరిస్తున్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా హైదర్‌గూడ గ్రామంలో ఉన్న సంస్కృతి గ్రామీణ బాలల చిత్ర కళ సదన్ ప్రాంగణంలో ప్రొగ్రాస్ ఆఫ్ ఆర్ట్ బర్డ్స్ (చిన్నారుల చిత్రకళ సౌరభం) అనే ప్రదర్శనను ఆదివారం చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం విజేతలకు స్వర్ణ పతకాలు, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అదే విధంగా ప్రముఖ చిత్రకళా అధ్యాపకులకు భారత సంస్కృతి పురస్కారాలు కూడా అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ప్రచురించిన రంగురంగుల బాలల చిత్ర కళాసంచికను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఇలాంటి ప్రదర్శనలు గత 32 సంవత్సరాలుగా ఏర్పాట్లు చేస్తున్నామని, దేశ, విదేశాల నుంచి కూడా ప్రతి ఏటా రెండు వేలకు పైగా బాలలు తమ చిత్రాలు పంపి పాల్గొంటున్నారని అన్నారు. ఏటా 500 పైగా స్వర్ణ పతకాలు అనేక ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులందరూ తమ పాఠశాలలో పాఠ్యాంశాలతో పాటు ఇతర అంశాలపైన ఆటలు, పాటలు, సంగీతం, చిత్రలేఖనం వంటి వాటిలో కూడా ప్రావీణ్యం సంపాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారులు సుభాష్ బాబు, బీఏ రెడ్డి, నారప్ప, పద్మరెడ్డి, శేఖర్ షిండే, రామకృష్ణ, సందీప్, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు వినతి



జగదీశ్వర్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న ఇజ్జత్‌నగర్‌వాసులు

శేరిలింగంపల్లి: ఇజ్జత్‌నగర్‌లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరుతూ శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్‌కు కాలనీవాసులు వినతిపత్రాన్ని అందజేశారు. నల్లగండ్లలోని ఆయన నివాసంలో ఇజ్జత్‌నగర్ వీకర్ సెక్షన్ బస్తీలో నూతనంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు ఆదివారం ఆయనను కలిశారు. బస్తీలో శ్మశానవాటికలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ దశలవారీగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షుడు మూడావత్ కృష్ణనాయక్, గౌరవ అధ్యక్షుడు నీలం బ్రహ్మయ్యయాదవ్, గౌరవ సలహాదారు కేశవులు, రాంచందర్‌యాదవ్, కృష్ణముదిరాజ్, తిరుపతయ్య, హుస్సేన్, అలీమ్, రమేష్‌నాయక్, చందు పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు



కార్పొరేటర్, నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో నానల్‌నగర్, గోల్కొండ డివిజన్ నాయకులతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. గోల్కొండ ఎండీ లైన్స్ చౌరస్తా నుంచి మోతీ దర్వాజా, గోల్కొండ రిసాలబజార్, ఖాజీగల్లి తదితర ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించానన్నారు. వరద నీటి పైపులైన్ పనులు పూర్తయిన చోట భారీ గుంతలు మూసివేయించానని అలాగే టోలిచౌకీ తూమ్స్ రోడ్డులో వరద నీటి పైపులైన్ పనులు చివరి దశలో ఉన్నాయని పేర్కొన్నారు. బంజారి దర్వాజ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు అధికారులతో చర్చించామని తెలిపారు. ఫతేదర్వాజా నుంచి మోతీదర్వాజా వరకు నూతన రోడ్డు వేసి ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాగా గత వారం కురిసిన వర్షాలకు నానల్‌నగర్, లంగర్‌హౌజ్ డివిజన్లలో బస్తీలు, కాలనీల్లో రోడ్లు బాగా దెబ్బతిన్నాయని వెంటనే మరమ్మతులు కూడా చేయిస్తానని హామీనిచ్చారు.

గోల్కొండ కోటకు పర్యాటకుల తాకిడి

గోల్కొండ: చారిత్రక కట్టడమైన గోల్కొండ కోటకు పర్యాటకులు పోటెత్తారు. వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో ఆదివారం పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కోటలోని ఆయుధాగారం, క్లాపింగ్ పోర్టిపో వద్ద గల ఫిరంగి వద్ద పర్యాటకులు సెల్ఫీలు దిగారు. అంతేగాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు నగీనా బ్యారెక్స్‌లోని రహస్య గదులను సందర్శించారు. శ్రీరామ భక్తులు కోట ఎగువ భాగంలో గల భక్త రామదాసు చరసాలను చూసి పరవశులయ్యారు.

కళాకారులకు ఐకాన్-2024 అవార్డుల ప్రదానం



యాకుత్‌పురా: అంతర్జాతీయ జానపద దినోత్సవం సందర్భంగా పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, తెలంగాణ కళల వేదిక సంయుక్తాధ్వర్యంలో ఆదివారం నగరంలోని శ్రీత్యాగరాయగాన సభలో ఐకాన్ అవార్డు-2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాతబస్తీకి చెందిన మంజుల డ్యాన్స్ అకాడమీ కళాకారులు అవార్డులు పొందారు. కార్యక్రమానికి అసెంబ్లీ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, తెలంగాణ కళల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పేరాల శేఖర్ రావు, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కే. మురళీ మోహన్ రాజు ముఖ్య అతిథులుగా హాజరై డ్యాన్స్ అకాడమీ నిర్వాహకురాలు మంజులతో పాటు భరత నట్యంలో ఉత్తమ ప్రదర్శన చేసిన పార్వతి అక్షయ, కే. శివానీకి అవార్డులు అందజేశారు.

ప్రభుత్వ శాఖల్లో వర్గీకరణ బిల్లు అమలయ్యేలా చూడాలి

గౌలిపురా: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ శాఖల్లో వర్గీకరణ బిల్లు అమలయ్యేట్లు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని అసోసియేషన్ సభ్యులు కోరారు. గౌలిపురా అంబికానగర్‌లోని శ్రీశ్రీ మైసమ్మ ఆలయం సమీపం గ్రౌండ్‌లో ఆదివారం షెడ్యూల్డ్ క్యాస్ట్ సంక్షేమ సంఘం అంబికానగర్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖలతో పాటు మెడిసిన్, ఇంజినీరింగ్ లాంటి సీట్ల కేటాయింపుల్లోనూ వర్గీకరణకు అనుగుణంగా ప్రతిపాదనలు చేసి ఏబీసీడీ ఫలాలు అందేలా చూడాలన్నారు. సీఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో ఆర్డినెన్స్ తీసుకువచ్చి వెంటనే వర్గీకరణ అమలయ్యేలా చూడాలని షెడ్యూల్డ్ క్యాస్ట్ సంక్షేమ సంఘం అంబికానగర్ ప్రధాన కార్యదర్శి రాజపాగ అర్జున్ కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బండి నరేశ్, నర్సింహా స్వామి, మంద నాగేశ్, వర్కల సత్యనారాయణ, మహేశ్, దుర్గారాజ్, గణేశ్, కె.ప్రభాకర్ బాబు, అసోసియేషన్ అధ్యక్షుడు జె.మురళీధర్ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలను ప్రవేశపెట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అఖిల భారత మహిళ సాంస్కృతిక సంఘం మహిళలు

మైలార్‌దేవ్‌పల్లి: కోల్‌కత్తాలోని ఆర్జీకార్ ఆసుపత్రి జూనియర్ వైద్యురాలు హత్యాచారానికి గురైన ఘటనను ఖండిస్తూ ఆదివారం మధుబన్ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఐఎంఎస్ఎస్ రాష్ట్ర నాయకురాలు హేమలత మాట్లాడుతూ.. మెడికల్ విద్యార్థిని పై జరిగిన ఘటన అనుకోకుండా జరిగినది కాదని పథకం ప్రకారమే జరిగిందని ఆమె అన్నారు. ఈ సంఘటనలో అనేక కోణాలు మన ముందుకు వస్తున్నాయని, నిజాలను తేల్చి దోషులకు కఠిన శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలను ప్రవేశపెట్టాలని కోరారు. అత్యాచారాలకు ప్రధాన కారణం మద్యం, మాదకద్రవ్యాలు, ఇంటర్‌నెట్‌లో వస్తున్న అసాంఘిక వీడియోల ద్వారానే యువత పెడదారిన పడుతున్నారని, వాటిని వెంటనే బ్యాండ్ చేసి దేశ మహిళలను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు వజ్రమ్మ, శైలజ, స్వరూపా, భారతి తదితరులు పాల్గొన్నారు.

బహుళ పంట సాగుపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శంషాబాద్ రూరల్: మండలంలోని గండిగూడలో ఆదివారం భాటి వ్యవసాయ క్షేత్రంలో బహుళ పంట సాగు విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు ఆధునిక సాగు పద్ధతులతో పాటు లాభదాయక పంటలపై దృష్టి పెట్టాలని సర్వోదయ మండలి కార్యదర్శి శ్రీనివాస్ సూచించారు. దీర్ఘ, స్వల్పకాలిక పంటలను ఒకే చోట పండించడం ద్వారా ఆదాయం సమకూర్చే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. మహాగణి, ఆవకాడు, మునగ, బీర, దొండ, అల్లం పంటలను ఒకే చోట సాగు చేస్తున్న విధానాన్ని రైతులకు వివరించారు. కలుపు నివారణ కోసం మల్చింగ్ షీట్, డ్రిప్‌తో సాగుకు నీరు అందించడంతో కూలీల ఖర్చు, తక్కువ నీటి అవసరం ఉంటుందని పేర్కొన్నారు. ఇక్కడ సాగు చేస్తున్న జెరేనియం సుగంధ పంట సాగు విధానాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్షేత్రం నిర్వాహకులు బసకట్ లాల్ భాటీ, రైతులు రాజశేఖర్, వివిధ మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నారులు

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పద్మశ్రీహిల్స్ కాలనీలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. సంకీర్తన ధామం నిర్వాహకులు వెంకటపతిదాసు ఆధ్వర్యంలో కాలనీ పార్కులో వేడుకలను 'హరే కృష్ణ' నామంతో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధా, గోపికల వేషధారణలు ధరించి విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అమరేందర్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయుటీసీ అధ్యక్షుడిగా సుదర్శన్



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

రాజేంద్రనగర్: శివరాంపల్లి పాఠశాలలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు గోవర్ధన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మహేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను పీఆర్‌టీయుటీఎస్ సంఘం మాత్రమే సాధిస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న సర్వీసు రూల్స్, డీఏలు, పీఆర్‌సీ, సీపీఎస్ రద్దు, పెండింగ్ బిల్స్ వెంటనే పరిష్కరించాలని తెలిపారు. అనంతరం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.సుదర్శన్, గౌరవాధ్యక్షులుగా మాణిక్యంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ సాగర్, అసోసియేట్ అధ్యక్షులుగా అల్లాహ వలీ, రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సత్తయ్య గౌడ్, మహిళా ఉపాధ్యక్షులుగా కల్పన, కార్యదర్శిగా వెంకటయ్య తదితరులు, మహిళా కార్యదర్శిగా రోహిణీలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎన్నికైన వారు రెండు సంవత్సరాలు పదవీ కాలంలో కొనసాగుతారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు సురేష్, వహీద్, సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, ఝాన్సీ, రవి, గోవర్ధన్, అనిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా..?



అధ్వానంగా మారిన సాలర్‌జంగ్ కాలనీ రోడ్డు

గోల్కొండ: ఇటీవల కురిసిన వర్షాలకు టోలిచౌకీ, నానల్‌నగర్ డివిజన్లలోని ప్రధాన రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా కాలనీల రోడ్లు గుంతలమయంగా మారి వాహనాదారులకు నరకాన్ని చూపెడుతున్నాయి. ఫ్లోర్ మిల్ నుంచి సాలర్‌జంగ్‌కాలనీ వెళ్లే రోడ్డుపై వర్షాపు నీరు ఇంకా నిల్వ ఉన్నది. అదే విధంగా టోలిచౌకీ నుంచి ఎండీలైన్స్ వెళ్లే రోడ్డు కూడా అధ్వానంగా తయారైంది. టోలిచౌకీ చౌరస్తాను ఆనుకొని ఉన్న సూర్యనగర్, జానకీనగర్ కాలనీ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. నిజాం కాలనీలోని టోలిచౌకీ వచ్చే రోడ్డు సైతం పూర్తిగా కంకర తేలింది. ఈ రోడ్డుపై నుంచి రావాలంటేనే వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.